ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

## వాహనాదారులకు హైకోర్టు వార్నింగ్

ప్రజానావ, ఖైరతాబాద్:

నగర పౌరులకు హైకోర్ట్ ఓ ముఖ్యమైన అలర్ట్ జారీ చేసింది. ఇకపై నగర రోడ్లపై వాహనాలు నడిపే వారంతా హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసింది. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేసింది. అలాగే హెల్మెట్ లేకుండా వాహనం నడిపడం, రాంగ్ రూట్లో వాహనాలు నడిపితే విధించే జరిమానాను మరింత పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ఇది వరకు రూ.100 గా ఉండగా.. ప్రస్తుతం రూ.200 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రాంగ్ రూట్లో వాహనం నడిపితే ఇది వరకు రూ.1000 జరిమానా చెల్లించాల్సి ఉండగా.. ఇపుడు రూ.2000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. హైకోర్ట్ మంగళవారం ఉత్తర్వులు విడదల చేసింది.

## వడ్లకు రూ.500 బోనస్ చరిత్రాత్మకం

ప్రజానావ, ఖైరతాబాద్:

రాష్ట్రంలో ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ అంశంపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సన్న ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించడం చరిత్రాత్మక కార్యక్రమమని ఉత్తమ్ అన్నారు. 2025 జనవరి నుంచి తెలంగాణ వ్యాప్తంగా రేషన్ కార్డు దారులందరికీ సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు. దీనిని దేశ చరిత్రలోనే ఓ మైలు రాయిగా అభివర్ణించారు. ధాన్యం సేకరణకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి గందరగోళం ఉత్పన్నం కాకుండా రైతులకు మద్దతివ్వడానికి ప్రజాప్రతినిధులు క్షేత్ర పర్యటనలు నిర్వహించాలని మంత్రి సూచించారు.

## భారత్‌లో 2036 ఒలింపిక్స్..?

(మొదటి పేజీ తరువాయి)




ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అక్టోబర్ 1వ తేదీనే దీనిని పంపినట్లు తెలుస్తోంది. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తామని, ఈ విషయంలో వెనక్కి తగ్గమని గతంలో ప్రధాని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. 'ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారతీయులు ఉత్సాహంగా ఉన్నారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలనూ చేస్తాం. ఏ విషయంలోనూ వెనక్కి తగ్గం. ఇది 140 కోట్ల భారతీయుల కల. అలాగే 2029 యూత్ ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఆయన అన్నారు. మరోపక్క.. 2028 (లాస్ ఏంజిల్స్), 2032 (బ్రిస్బేన్) ఒలింపిక్స్ వేదికలు ఖరారయ్యాయి. దాంతో అందరి చూపు 2036పై పడింది. '2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ రేసులో ఉంది' అని భారత ఒలింపిక్ కమిటీ గతంలో వెల్లడించింది. 2025లో ఐఓసీ అధ్యక్ష ఎన్నికల తర్వాత 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసే అవకాశం ఉంది. విస్తృత స్థాయిలో బిడ్డింగ్ కాకుండా ఆసక్తి ఉన్న దేశాల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఐఓసీ నాయకత్వ విభాగం ఈ ఆతిథ్య హక్కులను కట్టబెట్టే ఆస్కారం ఉంది. స్పాన్సర్లు, ప్రసార హక్కులు, ప్రభుత్వ మద్దతు, ప్రజల ఆదరణ.. ఇలా ఏ రకంగా చూసుకున్నా భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం వల్ల ఐఓసీకి లాభం చేకూరే అవకాశం ఉంది. అందుకే ఐఓసీ కూడా భారత్ వైపు మొగ్గు చూపేందుకు ఆసక్తితో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# కులగణన దేశానికే రోల్ మోడల్

(మొదటి పేజీ తరువాయి)




తెలంగాణలో జరిగే కులగణన దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కుల గణన.. కుల వివక్ష అనే వ్యాధి గురించి తెలుసుకునే పరీక్షలాంటిదని పేర్కొన్నారు. హైదరాబాద్ లోని బోయినపల్లిలో నిర్వహించిన కుల గణన సంప్రదింపుల వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టైటానిక్ పడవను తయారు చేసిన వాళ్లు ఈ పడవ ప్రపంచంలోనే అత్యంత పెద్దది.. ఇది ఎన్నటికీ మునిగిపోదు అనుకున్నారన్నారు. కానీ సముద్రంలో ఒక మంచు కొండను ఢీ కొని 20 నిమిషాలలో మునిగిపోయిందన్నారు. సముద్రంలో ఆ మంచు కొండ 10 శాతం మాత్రమే బయటకు కనిపించింది. మిగతా అంత లోతుగా ఉందని, అది తెలియక దాన్ని ఢీకొట్టి టైటానిక్ కుప్ప కూలిందన్నారు. అలాగే నేడు సమాజంలో కుల వివక్ష కూడా లోతుగా బలంగా ఉందన్నారు. దేశంలో కుల వివక్ష అనుభవించే వాళ్లకు ఆ బాధ తెలుస్తుందన్నారు.

**కులగణన అభినందనీయం..**

'మేము దేశంలో కుల వివక్ష అనే వ్యాధి గురించి తెలుసుకునేందుకు పరీక్షలు చేయాలని అనుకుంటున్నాం. అందుకే కుల గణన అనేది అత్యంత కీలకం. కులగణన చేస్తే ఏ కులం వాళ్లు ఎంత మంది ఉన్నారు. ఎవరు పేదలు, ఎవరికి ఏముంది అని తెలుస్తుంది. ఏదైనా వ్యాధి తెలియాలంటే ఎక్స్ రే చేయాలి కదా.. మేము కుల గణన చేస్తాం. ఎవరికి ఏముందో తెలుసుకుందాం అంటే ప్రధాని మోదీ ఎందుకు అడ్డుగా మాట్లాడుతున్నారు. మేము దేశాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తున్నాం అంటున్నారు. దేశంలో సంపదను ఎవరి వాటా వారికి ఇవ్వడం దేశాన్ని చీల్చడమా. దేశవ్యాప్తంగా కుల గణన చేసి వారి జనాభా తగ్గట్టు రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించాం. కుల వివక్ష అగ్రవర్ణాలలో లేదు. భారత రాజ్యాంగానికి కులవివక్ష వల్ల ముప్పు. కులగణన ద్వారా వ్యవస్థలను సరిచేయొచ్చు. అన్ని చోట్ల కులవివక్ష ఉంది. రాజకీయ, న్యాయ, కార్పొరేట్ వ్యవస్థల్లో కూడా ఉంది. ఆత్మవిశ్వాసాన్ని కులవివక్ష దెబ్బ తీస్తుంది. కులవివక్ష ఉందని ఒప్పుకోవాలి. కులగణన చేయమన్నందుకూ సమాజాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నామని బీజేపీ, మోదీ అంటున్నారు. నిజం చెప్పడం విభజించడమా? కులగణనతో ఎంత మంది దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు ఉన్నారో తేలుతుందని' అన్నారు. తెలంగాణలో కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కుల గణన చేపట్టడానికి ప్రశ్నలు తయారు చేయవద్దన్నారు. ప్రజల నుంచి వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలు తయారు చేయాలని సూచించారు. తెలంగాణ కుల గణన దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన దేశంలో కుల వివక్ష ఉందని సర్వేల్లో తెలుస్తుందన్నారు. వివక్ష తొలగించి అందరికీ సమానంగా జాతి సంపద అందించేందుకు కృషి చేస్తామన్నారు.

**కులగణన చారిత్రకం కాబోతోంది : సీఎం రేవంత్ రెడ్డి**

భారత్ జోడో యాత్ర ఎంతోమందిని కదిలించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేస్తున్నామని తెలిపారు. ఇందిరాగాంధీ 'గరీబ్ హఠావో' అనే నినాదంతో చరిత్రలో నిలిచారని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కులగణన చారిత్రకం కాబోతోందని, రాహుల్ గాంధీ నేతలకు మాట ఇస్తే అది శాసనమని రేవంత్ చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణనపై ముందుకెళ్తున్నామని, కులగణన చేసి తెలంగాణ దేశంలో ఆదర్శంగా రాష్ట్రంగా నిలవబోతోందని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో చెప్పారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలో 31,383 మంది మెయిన్స్ కు ఎంపికయ్యారని, ఇందులో ఓసీలు 3076, ఈడబ్ల్యూఎస్ 2774, ఓబీసీలు 17,921, ఎస్సీలు 4828, ఎస్టీలు 2783 ఉన్నారని గుర్తు చేశారు. కులగణన పూర్తి చేసి బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# నేటి నుంచే కుల గణన సర్వే

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:

రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను నేటి నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధమైంది. కుల గణన బాధ్యతలను ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలపై సమగ్ర సర్వే నిర్వహించనుంది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మొత్తం 75 రకాల ప్రశ్నలతో గణకులు వివరాలు తీసుకుంటారు. డిసెంబర్ 9లోగా బీసీ కుల గణన పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. బీసీ వర్గాల్లోని కులాలు, వాటి ఉప కులాల లెక్క తేల్చబోతున్నారు. మొత్తం 60 రోజుల్లో ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కులగణనకు అవసరమైన ప్రొఫార్మాను బీసీ కమిషన్ ఇప్పటికే తయారు చేసింది. దాదాపు 64 నుంచి 75 ప్రశ్నలతో ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం.

**జిల్లాల కలెక్టర్లు బాధ్యతలను పర్యవేక్షిస్తారు...**

రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దశలో బీసీ గణన చేపట్టి పూర్తి వివరాలను అధికారులు సేకరించనున్నారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేస్తామంటున్నారు. ఇందుకు దాదాపు 80 వేల మంది ఎన్యుమరేటర్లు, 10 వేల మంది సూపర్ వైజర్లు అవసరమవుతారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సిబ్బందికి హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనింగ్ పూర్తి అయ్యింది. ఈ శిక్షణ తీసుకున్న వారంతా జిల్లాల్లో ఇతర సిబ్బందికి అవగాహన కల్పిస్తారు. కులగణన పూర్తి చేసి..ఆ వివరాలను కంప్యూటర్‌లో పొందపరుస్తారు. ఏ రోజు వివరాలను ఆ రోజే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. జిల్లాల కలెక్టర్లు బాధ్యతలను పర్యవేక్షిస్తారు. మొత్తం వివరాలను బీసీ కమిషన్ పరిశీలించి వాటిని క్రోడీకరించి స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్లను సూచిస్తూ ప్రభుత్వానికి రిపోర్టును సమర్పించనుంది.

**మూడు వారాల పాటు ఈ సర్వే...**

సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులు, ప్రభుత్వ సిబ్బందిపై శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కుల గణనలో 36,549 మంది ఎస్‌జీటీలులు, 3,414 మంది ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్లు పాల్గొంటారని తెలిపింది. అంతేకాకుండా 6256 మంది ఎంఆర్‌సీలు, 2 వేల మంది మినిస్టీరియల్ సిబ్బంది కూడా భాగం కానున్నారు. ఈ కుల గణన సర్వే నుంచి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు మినహాయింపు ఇచ్చారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులు ఆదివారమే కాకుండా సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. మొత్తం మూడు వారాల పాటు ఈ సర్వే జరగనుంది.

# రేవంత్ పాలనలో 36 మంది విద్యార్థుల బలి

ప్రజానావ, ఖైరతాబాద్:




రెసిడెన్షియల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రాజకీయాల కారణంగా కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపించారు. ఈ 11 నెలల కాంగ్రెస్ పాలనలో 36 మంది రెసిడెన్షియల్ విద్యార్థులు మృతి చెందారని హరీశ్‌రావు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య రెసిడెన్షియల్ స్కూళ్లలో దొరుకుతుందని ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తున్నారని అన్నారు. గత పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో తల్లిదండ్రుల నమ్మకాన్ని పోగొట్టే విధంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో పరిస్థితులు దిగజారాయని చెప్పారు. ఇప్పటిదాకా నాకు తెలిసిన సమాచారం ప్రకారం ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని తెలిపారు.

**పట్టించుకునే తీరిక వారికి ఎక్కడ ఉంది..**

సగటుగా నెలకు ముగ్గురు ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యార్థులు మరణిస్తున్నారంటే ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. దాదాపు 600 మంది విద్యార్థులు ఈ ఏడు నెలల్లో ఫుడ్ పాయిజనింగ్ బారిన పడ్డారని గుర్తు చేశారు. పాములు, ఎలుకల కాట్ల ఘటనలు తరచుగా జరుగుతున్నాయని, పిల్లలకు కరెంట్ షాక్‌లు కూడా కామన్ అయిపోయాయన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వ దృష్టికి తెచ్చినా దున్నపోతు మీద వానపడ్డట్టే ఉందని విమర్శించారు. సీఎం, మంత్రులు అందరూ మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల బిజీలో ఉన్నారని, రెసిడెన్షియల్ స్కూళ్లపై పట్టించుకునే తీరిక వారికి ఎక్కడ ఉంది? అని నిలదీశారు. ప్రతి రోజూ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు ఉన్న దుస్థితుల గురించి మీడియాలో కథనాలు కూడా వస్తున్నాయని, వాటిపై నిప్పు మీద నీళ్లు జల్లినట్టు అప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం కాదు, శాశ్వత చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. 36 మంది రెసిడెన్షియల్ విద్యార్థుల మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలే అని అనడంలో ఎలాంటి తప్పులేదన్నారు. ఈ మరణాలపై ప్రభుత్వంలో ఏ స్థాయిలోనూ సమీక్షలు జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


# ఆటో డ్రైవర్ల బాధలు కలచివేశాయి

ప్రజానావ, హైదరాబాద్ :

రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొచ్చిన ఫ్రీ బస్సు కారణంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. తక్షణమే మీటర్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద ఆటో యూనియన్లు మహా ధర్నాకు దిగారు. ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికలకు ముందు ఆటోవాలాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. మహా లక్ష్మి స్కీమ్ కు ముందు యావరేజ్‌గా 1000 రూపాయలు సంపాదన ఉంటే.. ఇప్పుడు 500 కూడా సరిగ్గా రావడం లేదు అని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చింది.. అది అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాద బీమాను రూ. 10 లక్షలకు పెంచి.. సాధారణ మరణాలకు వర్తింప చేయాలని ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ ధర్నాలో మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు పలువురు ఆ పార్టీ నేతలు పాల్గొని యూనియన్ నేతలకు మద్దతు పలికారు.

**ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏది...?**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చింది. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది రాహుల్ గాంధీ వచ్చి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ల సమస్యలు తీరుస్తానని రంగుల కల చూపించారు. నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మనం మంచి కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నారు. వాటిని ఇవ్వాలని కోరుతున్నాం. కానీ గత 11 నెలల్లో వీళ్లు చెప్పిన దానికి చేసిన దానికి ఎంత తేడా ఉందో... ఏం మార్పు వచ్చిందో ఒక్కసారి ఆలోచించాలని ఆటో అన్నలను కోరుతున్నాని కేటీఆర్ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ఇక్కడకు ఎక్కువ మంది రాకుండా పోలీసులు ప్రయత్నం చేశారు. దయచేసి పోలీసులు అలా చేయవద్దు. ఎందుకంటే మిమ్మల్ని మీతోనే కొట్టించే పరిస్థితి తీసుకువచ్చారు. పోలీసులు డ్యూటీలు చేయండి. కానీ పేద వాళ్ల పట్ల దయతో ఉండండి. సెక్యూరిటీ లేకుండా బయటకు వెళితే రేవంత్ రెడ్డిని తన్నే పరిస్థితి ఉంది. అందుకే ఆయనకు భయం పట్టుకుంది. రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతాం.




కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మనం కోరుతున్నాం. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. మీ తరఫున శాసనసభలోనూ మేము పోరాటం చేస్తాం. మెయిన్ స్ట్రీమ్ మీడియా కూడా భయపడకుండా పోరాటం చేసే వాళ్ల సమస్యలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నాను అని కేటీఆర్ తెలిపారు.

**కేటీఆర్ రాకపై సందిగ్ధం...**

ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల మహాధర్నాకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాకపై సందిగ్ధం నెలకొంది. ఈ ధర్నాలో సీఐటీయూ, ఏఐసీయూటీ, బీఆర్టీయూ, టీయూసీఐ, జీయూసీఐ, యూటీఏడీడబ్ల్యూఏ, టీఏడీఎస్ లాంటి సంఘాలు పాల్గొన్నాయి. కానీ, బీఆర్టీయూ సంఘం కేటీఆర్ నీ జేఏసీకి తెలియకుండా స్వాగతించారని, మిగితా సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో కేటీఆర్ రావడంపై నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## విజన్ 2050తో వరంగల్ మాస్టర్ ప్లాన్

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:

హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేదని, వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ రాబోతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గొప్ప చారిత్రక నేపథ్యమున్న వరంగల్ నగర అభివృద్ధి మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుందన్నారు. చారిత్రక నగరమైన వరంగల్ అభివృద్ధిపై రేవంత్ రెడ్డి సర్కార్ ఫోకస్ పెట్టింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ ప్లాన్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే విడుదల చేస్తారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్‌సీహెచ్‌ఆర్డీలో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**లైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్...**

ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరచాలనే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. వరంగల్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్ తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందని అన్నారు. అభివృద్ధి పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచించారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని, మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండవ దశలో 11 కిలోమీటర్లు, మూడవ దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేదని వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ రాబోతోందని, వీలైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని, ఇందుకు సంబంధించిన పనులను త్వరలో మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండ చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు.

## తెలంగాణ అప్పుల్లో మునిగింది

(మొదటి పేజీ తరువాయి)

రుద్రంగిలో ఎంపీ ల్యాడ్స్, ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. దేశమంతా పాదయాత్ర చేశానని చెప్పుకున్న రాహుల్ గాంధీకి ధైర్యముంటే 6 గ్యారంటీలపై తెలంగాణలో పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల హామీలతో కర్నాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ.. మహారాష్ట్రలోనూ దొంగ హామీలు, అబద్ధాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారని, వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తానని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. మూసీని అడ్డుపెట్టుకుని లక్షన్నర కోట్ల దోపిడీని ఆపాలన్నారు. రూ. 15 వేల కోట్లతో ఖర్చయ్యే ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లకు పెంచి కమిషన్లు దండుకోవడానికి మేం వ్యతిరేకమన్నారు. తెలంగాణ నిండా అప్పుల్లో మునిగిపోయిందని, బీఆర్ఎస్ చేసిన అప్పులను తీర్చేందుకు గంటకు 3 కోట్ల మిత్తి కట్టాల్సి వస్తోందని మంత్రులే మొత్తుకుంటున్నారని గుర్తు చేశారు. ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, జీతాలకే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారని, అలాంటప్పుడు మళ్లీ లక్షన్నర కోట్ల అప్పు తెచ్చి జనంపై రుద్దడం ఎంత వరకు కరక్టన్నారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్లు దోచుకుంటే మీరు లక్షన్నర కోట్లు దోచిపెట్టడానికి మూసీని వాడుకుంటారా..? అంటూ మండిపడ్డారు.

కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతున్నారు..

తెలంగాణలో 6 గ్యారంటీలను అమలు చేస్తున్నామని, రుణమాఫీ చేసినమని ఊదరగొడుతూ మహారాష్ట్రలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పేరుతో కోట్ల రూపాయల యాడ్స్ ఇచ్చిందని బండి సంజయ్ మండిపడ్డారు. కేసీఆర్ కూడా ఇలాగే మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చు చేసిందని, పంజాబ్ రైతులకు పప్పు బెల్లంలా పంచిండని గుర్తు చేశారు. తెలంగాణ రైతులను అరిగోస పెట్టిన కేసీఆర్‌ను మించి కాంగ్రెస్ పాలనలో దోపిడీ జరుగుతుందని ఆరోపించారు. ఒకవైపు ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతూ ఇంకోవైపు మహారాష్ట్ర ఎన్నికలకు తెలంగాణ పైసలను వాడుకునేందుకు సిగ్గుండాలన్నారు. 6 గ్యారంటీల అమలు కాలేదని, రుణమాఫీ పూర్తి కాలేదని, ఇంకా 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉందని వ్యవసాయ శాఖ మంత్రే ప్రకటించాడన్నారు. కానీ మహారాష్ట్రలో మాత్రం రుణమాఫీ చేసినట్లుగా, 6 గ్యారంటీలను అమలు చేస్తున్నట్లుగా గొప్పలు చెబుతున్నారన్నారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి కర్నాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసినట్లుగానే ఇప్పుడు మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతుందన్నారు.

## ఎమ్మెల్సీ కోసం ప్రభుత్వ ఉద్యోగాలకు రిజైన్

ప్రజానావ, ఖైరతాబాద్ :

తెలంగాణ రాజకీయం మరోసారి రసవత్తరంగా మారుతోంది. వచ్చే సంక్రాంతి నాటికి స్థానిక సంస్థల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడేలా త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రకటనలు పొలిటికల్ హీట్ పెంచుతుంటే.. మరోవైపు రాష్ట్రంలో ఖాళీ కాబోతున్న గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ మరింత ఉత్కంఠగా మారుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అంశంపై ప్రధాన పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా ప్రణాళికలు రచిస్తుండగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సై అంటుండటం ఈ ఎన్నికను మరింత రసవత్తరంగా మారుస్తున్నది. కరీంనగర్‌మెదక్‌నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పట్టాభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారు ఇప్పటి నుంచే తమ పొలిటికల్ గ్రౌండ్ ను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీలలోని ఆశావాహులు టికెట్ కోసం ఇప్పటి నుంచే తమ గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధం అవుతుండం రాజకీయాన్ని రంజుగా మారుస్తున్నది, ప్రజాక్షేత్రంలోకి దిగేందుకు తమ సర్వీసును వదులుకుంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా ఇటీవల గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పులి ప్రసన్న హరికృష్ణ తన ఉద్యోగానికి రాజీనామా చేయగా తాజాగా మదనం గంగాధర్ తన డీఎస్పీ ఉద్యోగాని రిజైన్ చేసి సంచలనంగా మారారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బోయినిపల్లి మండలం గుండన్నపల్లికి చెందిన పులి ప్రసన్న హరికృష్ణ త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే ఏ రాజకీయ పార్టీ నుంచి పోటీ చేయాలనేది ఇంకా నిర్ణయించుకోలేదన్నారు.నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కు చెందిన గంగాధర్ అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించారు. 22 ఏళ్లకే తొలి ప్రయత్నంలో ఎస్ఐగా సెలెక్ట్ అయిన గంగాధర్ పోలిస్ టు పాలిటిక్స్ లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు.

## తప్పు చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టం

ప్రజానావ, హైదరాబాద్ :

హోటళ్ల యజమాన్యాలు సరియైన పద్ధతిలో వ్యాపారం చేసుకోవాలని, ఫుడ్ హైజీన్, ఎన్విరాన్‌మెంట్ హైజీన్ మెయింటేయిన్ చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తూ కొత్తగా మరో మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌స్‌లను వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో ఏర్పాటు చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. అలాగే కొత్తగా 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ తీసుకొస్తున్నామని, ఇందుకోసం ఇప్పటికే వాహనాల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. నాచారం ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను ఆధునీకరిస్తున్నామని, సంవత్సరానికి కనీసం 24 వేల ఫుడ్ సాంపిల్స్ టెస్ట్ చేసేలా ల్యాబులను ఆధునీకరిస్తామని ప్రకటించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వెంగళరావు నగర్‌లో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను మంత్రి దామోదర రాజనర్సింహ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండొద్దన్నారు. పెరిగిన హోటళ్ల సంఖ్య, జనాభాకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచబోతున్నామని, ఫుడ్ సేఫ్టీకి సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం కలెక్టరేట్లలోనే స్పెషల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. నియమాలను పాటిస్తూ బిజినెస్ చేసుకునేవారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తప్పు చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టమని, హాస్టళ్లలో పిల్లలకు మంచి భోజనం పెట్టనివారిని కూడా తప్పకుండా శిక్షిస్తామని చెప్పారు. హైదరాబాద్ అంటే బిర్యానీకి, మంచి ఫుడ్‌కి ఫేమస్ అని, ఆ పేరును విశ్వవ్యాప్తం చేసేలా హోటల్ ఇండస్ట్రీ, స్ట్రీట్ ఫుడ్ ఇండస్ట్రీ ఉండాలన్నారు. ప్రతి హోటల్‌ను, రెస్టారెంట్‌ను, స్ట్రీట్ సైడ్ ఫుడ్ స్టాల్స్‌ను, డైట్ క్యాంటీన్లను అధికారులు తనిఖీలు చేస్తారని తెలిపారు.



# తిరుమలాపూర్‌లో కిడ్నాప్ కలకలం

## చాక్లెట్ ఆశ చూపి బాలికను కిడ్నాప్ చేసిన కిడ్నాపర్లు

**- నాలుగు గంటలు బంధించి, ఆ తర్వాత వదిలివెళ్లిన వైనం**

**- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు**






**ప్రజానావ, దౌల్తాబాద్:**
పచ్చని పల్లె లో కిడ్నాప్ కలకలం ఆ గ్రామస్తులను కలవరింతకు గురిచేసింది. ముక్కు పచ్చలారని ఓ చిన్నారిని చాక్లెట్ ఆశ చూపి కారులో తీసుకెళ్లిన దుండగులు నాలుగు గంటల అనంతరం మళ్లీ తిరిగి గ్రామ సమీపంలో వదిలి వెళ్లడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఈ ఘటనతో మండలం మొత్తం ఉలిక్కిపడింది. పిల్లల భద్రత గురించి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు బాలిక తల్లి దండ్రులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బాలిక స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. కాగా సోమవారం బాలిక 11 గంటల సమయంలో స్నేహితురాలు ఇంటికి నోట్ బుక్ కోసం వెళ్లగా కారులో వచ్చిన దుండగులు చాక్లెట్ ఇస్తామని నమ్మబలికారు. వద్దని బాలిక వారించిన కారులోంచి దిగిన ఒక దుండగుడు బాలిక నితీసుకెళ్లి కారు డిక్కీలో వేసుకొని వెళ్లిపోయారు. ఉదయం సుమారు 12 గంటల ప్రాంతం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బాలికను కారులో బంధించి వివిధ ప్రాంతాలను తిప్పిన దుండగులు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తిరుమలాపూర్ గ్రామ సమీపంలో బాలికని విడిచి వెళ్లారు. కాగా అనంతరం బాలిక కుటుంబ సభ్యులు దౌల్తాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గ్రామంలో ఉన్న సీసీటీవీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నారు.

> **దుండగులను పట్టుకోవాలి..**
> **- బాలిక తండ్రి రాములు**
> ప్రశాంతమైన పల్లెలో కిడ్నాప్‌లు జరగడం భయాందోళనకు గురిచేస్తుంది. నా బిడ్డకు ఇది పునర్జన్మ. ఇలాంటి ఘటన మళ్లీ పునరావృతం కాకుండా, మరి ఏ తల్లిదండ్రి బిడ్డల రక్షణ విషయంలో ఆందోళన చెందకుండా ఉండాలంటే దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలి.



## కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు రవాణా చేయాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజానావ, మెదక్:**
కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు రవాణా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని ఎర్రగుంట తండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు తీరును రిజిస్టర్‌ల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు రవాణా చేపట్టి తరలించాలని ధాన్యం కొనుగోలు సిబ్బందికి సూచించారు. సన్న రకం దొడ్డు రకం విక్రయాలను వేరువేరుగా చేపట్టాలని నిర్వాహకులకు చెప్పారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తున్నట్లు రైతులకు కలెక్టర్ తెలిపారు. ట్యాబ్ ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## పాడి పశువులకు ఉచిత పశు వైద్యశిబిరం

**ప్రజానావ, జగదేవ్‌పూర్:**
జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో మంగళవారం పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా డాక్టర్ జెస్సీ ఆధ్వర్యంలో గోపాల మిత్రుల సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, సాధారణ చికిత్సలు, గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, దూడలకు నటన నివారణ మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జెస్సీ మాట్లాడుతూ రైతుల ఆర్థిక ప్రగతిలో పాడి పశువులు ముఖ్య పాత్ర పోషిస్తాయని ఒక గేదె ఒక ఎకరం పొలంతో సమానమని రైతులకు వివరించారు. పశుసంపదలో పశుగణాభివృద్ధి ద్వారా విధులు నిర్వహిస్తున్న గోపాలమిత్రులు కీలక పాత్ర వహిస్తున్నారని రైతులు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిగడప ఎల్‌ఎస్‌ఏ సిద్ధయ్య, వీఏ స్వామి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ భాస్కర్‌గౌడ్, గోపాలమిత్రులు గౌరయ్య, యాదగిరి, సర్వర్‌ఖాన్, కనకస్వామి, పా

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

### బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



**ప్రజానావ, మెదక్:**
దళారుల వ్యవస్థను వెంటనే అరికట్టాలని వడ్ల తేమ శాతం 17కు పెంచాలని అన్ని కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మెంచు నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే సేకరించి తూకం వేయాలని కోరారు. ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, అన్నిరకాల మౌలిక వసతులు కొనుగోలు కేంద్రాల్లో కల్పించాలన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా చేపట్టాలని, ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాల గురించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రకాల సన్న రకం ధాన్యానికి అదనంగా 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసి రవాణా చేయాలని, రైస్ మిల్లర్లు, రైతులకు ఇబ్బంది కలగకుండా వెంటనే ధాన్యం దిగుమతి చేసుకొని చర్యలు తీసుకోని ట్రాక్ షిట్ అందజేయాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, పట్టణ కో కన్వీనర్ గడ్డమీద కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్స్ జయరాజు, ఆర్కే శ్రీనివాస్, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజాగౌడ్, నాయకులు ప్రభురెడ్డి, మాయ మల్లేశం, మేడిశెట్టి శంకర్, మధు, మోహన్ రాథోడ్, సాయిలు, లింగ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజానావ, మెదక్:**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉద్యమ కార్యచరణలో భాగంగా మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ రిపోర్ట్ తెప్పించుకొని 60శాతం ఫిట్మెంట్‌తో అమలు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. జీవో 317 బాధితులకు వెంటనే న్యాయం చేయాలని, జీపీఎఫ్ పెండింగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలన్నారు. జీవో 317 విషయంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యులు భాస్కర్, రామారావు, తపస్ మహిళా అధ్యక్షురాలు స్వరూపరాణి, మహిళా ఉపాధ్యక్షులు మాధవి, రేఖ, సుమతి, విజయ, సంగీత, ప్రశాంత, తపస్ జిల్లా బాధ్యులు వెంకటస్వామి, చక్రవర్తి, రవీందర్, నరేందర్‌గౌడ్, మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, మల్లేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.







## ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి


**ప్రజానావ, రామాయంపేట:**
మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం ప్రభుత్వ ఆసుపత్రిని మెదక్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరి ప్రియతో కలిసి జిల్లా వైద్యాధికారి 'సే నో టు డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ నేటి తరం యువత మత్తుకు బానిస కావడంతో వారి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి గింజైనా కొనలేదు

### బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**ప్రజానావ, నార్సింగి:**
కొబ్బరికాయలు కొట్టడం, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం తప్ప రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం ఒక్క గింజ కూడా ధాన్యం కొనుగోలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలోని కాస్లాపూర్, జాప్తి శివునూర్ గ్రామల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించకుంటే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రం నుండి జిల్లా అధికారులకు ఫోన్ లో మాట్లాడారు రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు గత ప్రభుత్వం 17 తేమశాతంతో ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ ప్రభుత్వం 12% పేరిట రైతులను ఇబ్బందులు పెడుతుందని ఆమె మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు లేవని ఆమె మండిపడ్డారు షరతులు లేకుండా అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకరంపేట మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు పట్లోరి రాజు, వైస్ ఎంపీపీ సుజాత, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చంద్రం, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బాగారెడ్డి, గొండస్వామి యాదవ్, యాదగిరి యాదవ్, నర్సింగ్ రావు, అంజయ్య, శ్రీనివాస్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.





## ఉమ్మడి జిల్లా రగ్బీ జట్టు ఎంపిక పోటీలు



**ప్రజానావ, చేగుంట:**
చేగుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన మెదక్ ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాల బాలికల రగ్బీ పోటీలకు మెదక్ ఉమ్మడి జిల్లా నుండి 350 మంది క్రీడాకారిణులు, క్రీడాకారులు పాల్గొనగా అందులో నుండి మంచి ప్రతిభ కనబర్చిన 36 మంది బాలికలను, 36 మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని కోచ్ కరణం గణేష్ రవికుమార్, మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి రమేష్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు నాగరాజు, సెలక్షన్ కమిటీ ఇన్‌చార్జి శారద తెలిపారు. అండర్ 17 బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా కేఎల్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో రాష్ట్ర ఎంపిక పోటీలు జరుగుతాయని ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పాల్గొని క్రీడాకారులు క్రీడాకారునిలు ప్రతినిత్యం శ్రద్ధతో ప్రాక్టీస్ చేసి జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పథకాలు సాధించి చదువుకునే స్కూల్‌కి, కాలేజీకి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని అలాగే క్రీడల వల్ల రెండు శాతం కోటతో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధి, ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షులు భరత్‌రెడ్డి, ప్రధాన కార్యదరిది అజయ్, రగ్బీ రెఫరీలు నవీన్, మహేష్, శ్రీనాథ్, పీఈటీలు నరేష్, ప్రవీణ్, శేఖర్, శంకర్, నర్సింహులు, సరిత, మంజుల, ప్రభు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం?

**ఐఓసికు లేఖ రాసిన భారత ఒలింపిక్ సంఘం!**

న్యూఢిల్లీ: విశ్వక్రీడలు ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు భారత్ సిద్ధమవుతున్నట్టు తెలిసింది. 2036లో ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహించేందుకు ఆసక్తి తెలియజేస్తూ భారత్ అంతర్జాతీయ ఒలింపిక్ సంఘాని (ఐఓసి)కి అధికారికంగా లేఖ రాసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెల్లువెత్తాయి. ఇదే జరిగితే భారత్ ఒలింపిక్స్ నిర్వహణ కల సాకారం అయ్యే అవకా శాలున్నాయి. ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహించేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తామని ప్రధాని పేర్కొన్నారు. ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారతీయులు ఉత్సాహంగా ఉన్నారని, దీని కోసం 140 కోట్ల మంది ప్రజలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారని గతంలో ప్రధాని వెల్లడించారు. ఇదిలావుండగా తాజాగా ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ సిద్ధంగా ఉందని తెలియజేస్తూ ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ఇప్పటికే ఐఓసికి లేఖ రాసినట్టు తెలిసింది. కాగా, 2028 ఒలింపిక్స్‌కు అమెరికా నగరం లాస్ ఏంజిల్స్, 2032 విశ్వక్రీడలకు బ్రిస్బేన్ (ఆస్ట్రేలియా) ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దీంతో అందరి చూపు 2036 ఒలింపిక్స్‌పై పడింది. ఇక 140 కోట్ల జనాభా కలిగిన అతి పెద్ద దేశం భారత్ కూడా ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం రేసులో నిలిచింది. 2025 అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ (ఐఓసి) ఎన్నికల తర్వాత 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసే అవకాశాలున్నాయి. ఆసక్తి ఉన్న దేశాల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఐఓసి నాయకత్వ విభాగం ఒలింపిక్స్ నిర్వహణ బాధ్యతలు అప్పగించే ఛాన్స్ఉంది. స్పాన్సర్లు, ప్రసార హక్కులు, ప్రభుత్వ మద్దతు, ప్రజల ఆదరణ తదితర విషయాలను పరిగణలోకి తీసుకుంటే ఐఓసి భారత్‌వైపే మొగ్గు చూపే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. భారత్‌లో ఒలింపిక్స్ వంటి మెగా క్రీడలను నిర్వహిస్తే ఐఓసి లాభం చేకూరే అవకాశాలే అధికంగా ఉన్నాయి. అందుకే ఐఓసి కూడా భారత్‌కే ఒలింపిక్స్ నిర్వహించే అవకాశం కల్పించినా ఆశ్చర్యం లేదు. అదే జరిగితే భారత క్రీడా రంగానికి కొత్త జోష్



లభించడం ఖాయం. ఆతిథ్య హక్కులు లభిస్తే ఈ క్రీడల్లో భారత్ అసాధారణ ఆటతో పతకాలు పంట పండించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. క్రీడల నిర్వహణకు దాదాపు పది సంవత్సరాల సమయం ఉంటే పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడం కష్టమేమీ కాదు. ఇదిలావుంటే ఒలింపిక్స్ నిర్వహణ ఛాన్స్ లభిస్తుందా లేదా అనేది ఇప్పటికీ సందేహంగానే ఉన్నా అభిమానులు మాత్రం భారీ ఆశలు పెట్టుకున్నారు. ఒలింపిక్స్ వంటి విశ్వ క్రీడలు నిర్వహించే ఛాన్స్ లభిస్తే దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇదే విషయాన్ని ప్రధాని మోడీ ఇప్పటికే స్పష్టం చేశారు.

# జంగ్రా సూపర్



**ప్రపంచ బాక్సింగ్ టైటిల్ సాధించిన మన్‌దీప్**

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రీడల్లో భారత జాతీయ పతాకం మరోసారి రెపరెపలాడింది. కేమన్ ఐలాండ్ వేదికగా జరిగిన డబ్లూబిఎఫ్ ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన మన్‌దీప్ జంగ్రా టైటిల్‌ను సాధించి నయా చరిత్ర సృష్టించాడు. బ్రిటన్ బాక్సర్ కొనార్ మెకింతోష్‌తో జరిగిన పోరులో మన్‌దీప్ చిరస్మరణీయ విజయం సాధించాడు. తొలి రౌండ్ నుంచే ప్రత్యర్థిపై కళ్లు చెదిరే పంచులతో విరుచుకుపడిన మన్‌దీప్ అలవోక విజయంతో ప్రపంచ టైటిల్‌ను దక్కించుకున్నాడు. కొనార్ ఏదశలోనూ మన్‌దీప్‌కు కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయాడు. అసాధారణ ఆటతో అలరించిన హర్యానాకు చెందిన మన్‌దీప్ చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. కాగా, మన్‌దీప్ ఒలింపిక్స్ పతక విజేత రాయ్ జోన్స్ దగ్గర శిక్షణ పొందాడు. జోన్స్ శిక్షణలో మన్‌దీప్ ఎంతో రాటుదేలాడు. చివరికి ప్రపంచ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

# జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్ 2024 పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజానావ, సిరిసిల్ల:**

జన విజ్ఞాన వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు 2024లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా విద్యాధికారి ఏ. రమేశ్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ను కల్పించడంలో జనవిజ్ఞాన వేదిక పాత్ర చాలా ఘన నీయమైన పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ నెల 7న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో, 28న జిల్లా స్థాయిలో, డిసెంబర్ 14,15,16 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఈ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మార్వాడి గంగరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు గుర్రం ఆంజనేయులు, కోశాధికారి మెడపట్ల కిషన్, కార్యదర్శి రాజలింగం, ప్రచార కమిటీ బాధ్యులు కులేరి ప్రేమ్ సాగర్, పిట్టల దేవరాజు, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగానే ధాన్యం కొనుగోళ్లు



**అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**
**బొప్పాపూర్ లో కొనుగోలు కేంద్రం తనిఖీ**

**ప్రజానావ, ఎల్లారెడ్డిపేట:**

ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో సజావుగానే ధాన్యం సేకరణ కొనసాగుతుందని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మొత్తం ఎంత మంది రైతులు ధాన్యం కేంద్రంలో పోశారు? ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్లు ధాన్యం సేకరించారని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు రాకుండా అన్ని వసతులు కల్పించామని తెలిపారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. రైతులందరూ తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దళారులకు విక్రయించవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలను పరిష్కరించండి




**టీజీ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ**

**ప్రజానావ, సిరిసిల్ల:**

ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కారించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా టీజీ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ ఎల్. రాంరెడ్డి కోరారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాం రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చిందన్నారు. 11 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం హామీల అమలు చేయలేదన్నారు. కార్మికులు, సమస్యల పరిష్కారం కోసం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు, సామూహిక నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనలేదన్నారు. సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమాలకు జాయింట్ యాక్షన్ కమిటీ శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల అయినందున అపాయింటెడ్ డేట్ ప్రకటించి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరింపజేసి, 2021 వేతన సవరణ చేయాలన్నారు. 2017 వేతన సవరణ ఎరియర్స్ ఇస్తూ అలవెన్స్లను పెంచి, ప్రైవేటు బస్సులు రద్దు చేస్తూ, ఆర్టీసీకి కొత్త బస్సులు కొనుగోలు చేయాలని కోరారు. కొత్త నియామకాలు చేపట్టి, మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రతినెల రూ.350 కోట్లు విడుదల చేయాలన్నారు. మహాలక్ష్మి మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు, ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ జీవో నెం.30లో పేర్కొనబడిన ఉత్తర్వుల ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులకు కూడా వయసు పరిమితిని 44 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కో చైర్మన్ ఎం. లక్ష్మణ్, జీపీ సింగ్, సభ్యులు పీ. దేవయ్య, ప్రకాశ్, శ్రీనివాస్, రఘు నాయక్, మదన్, గణేశ్, బీ. శ్రీనివాస్, శ్రీహరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయించాలి

**త్వరలో బ్యాంక్ గ్యారంటీ అందజేస్తాం**
**అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కు వినతి పత్రం**
**అందజేసిన పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు**

**ప్రజానావ, సిరిసిల్ల:**



జిల్లాలో ఖరీఫ్ సీజన్ 2024-25 ధాన్యం తమకు కేటాయించాలని పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో అదనపు కలెక్టర్ ను పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు కలిశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కేటాయించే ధాన్యానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీ త్వరలోనే అందజేస్తామని తెలిపారు. తమకు కేటాయించే ధాన్యానికి మాత్రమే బ్యాంక్ గ్యారంటీ ఇస్తామని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా పాత గన్ని బ్యాగుల్లో ధాన్యం పంపాలని, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఇచ్చే బియ్యానికి సరిపడా కొత్త గన్ని బ్యాగులు ఇవ్వాలని, తమకు సన్న ధాన్యం కేటాయించవద్దని కోరారు. 2023-24 రబీ సీజన్ నిల్వల ప్రాతిపదికన పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలని అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో పారా బాయిల్డ్ రైస్ మిల్లుల సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలి



**మద్దతు ధర పొందాలి**
**కొనుగోలు కేంద్రాల సందర్శనలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**ప్రజానావ, సిరిసిల్ల:**

రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్ద బోనాల, చిన్న బోనాల, ముష్టిపల్లి, సర్దాపూర్ ల్లోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. ఆయా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. జిల్లాలో ఐకేపీ, మెప్మా, పీఏసీ ఎస్, డీసీఎంఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఇప్పటికే 246 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సీసీఐ ఆధ్వర్యంలో దాదాపు ఐదు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. వరి, పత్తి పండించిన రైతులు తమ పరిధిలోని కేంద్రాలకు పంట ఉత్పత్తులను తరలించాలని సూచించారు.

# ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

**ప్రజానావ, సిరిసిల్ల:**

- పోలీస్ అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో సందర్శించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఇల్లంతకుంట పోలీస్ అధికారులు, సిబ్బంది పని తీరుపై ప్రశంస



వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ కేసులు నమోదు చేయాలని, అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఇల్లంతకుంట స్టేషన్ తనిఖీచేసి రిసెప్షన్ సిబ్బంది పనితీరు, ఫిర్యాదులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ లో నిర్వహిస్తున్న పలు రకాల రికార్డులను పరిశీలించి, స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ అధికారుల, సిబ్బంది పని తీరు భేషుగ్గా ఉందని ప్రశంసించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. వివిధ సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది తరచు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులు తెలిసేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ, స్టేషన్ పరిధిలోని రౌడి షీటర్స్, హిస్టరీ షీటర్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ , డ్రంక్ అండ్ డ్రైవ్ లు ఏర్పాటు చేయాలని, గంజాయి కిట్ల సహాయంతో అనుమానిత వ్యక్తులకు టెస్ట్ లు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.



# అత్యవసర వైద్యం.. అందనంత దూరం

**ప్రజానావ, జగిత్యాల :**

అత్యవసర సమయంలో జనరల్ ఆసుపత్రిలో వైద్య నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ ఆసుపత్రులే దిక్కు సేవలు పూర్తిస్థాయిలో లభించడంలేదు. నిత్యం 400కుపైగా ఓపీ 150కి మించి ఇన్‌పేషంట్లకు సేవలందిస్తున్నప్పటికీ అత్యవసర వైద్యం కోసం ప్రైవేటుపై ఆధారపడాల్సి వస్తోంది. వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రికి నిత్యం అత్యవసర పరిస్థితిలో రోగులు వస్తుంటారు. వీరికి అన్ని రకాల ఆధునిక వైద్య పరీక్షలు, చికిత్స అందుబాటులో లేకపోవడంతో వరంగల్‌కు పంపిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాల బారినపడ్డప్పుడు, మెదడుకు సంబంధించిన, హృద్రోగులకు కీలక సమయాల్లో చేసే పరీక్షలు ఇక్కడ లభ్యం కావడంలేదు. ప్రస్తుతానికి ఇక్కడి ఆసుపత్రిలో ఈసీజీ, ఎక్స్‌రే, సియామ్, సిటీస్కాన్, 2డీ ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కీలకమైన ఎంఆర్ఐ, యాంజియోగ్రాం తదితర ఆధునిక వైద్య వసతులు లేకపోవడంతో రోగులు ప్రైవేటు, లేదా వరంగల్, హైదరాబాద్ ఆసుపత్రులపై ఆధారపడుతున్నారు. సాధారణ ఆసుపత్రి స్థాయి పెరిగినా భవనంలో అత్యాధునిక వసతులకు స్థలం సరిపోకపోవడంతోపాటు, సాంకేతికపరమైన ఇబ్బందులు చాలా ఉన్నాయి. ఆధునిక వైద్య వసతుల కోసం వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

**గంటలోపు చికిత్సతోనే ఫలితం..**

రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో తీవ్రగాయాల బారిన పడ్డవారిని అధునాతన వైద్యం కోసం 'గంటలోపు' ఆసుపత్రికి చేర్చితే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. దీన్నే గోల్డెన్ అవర్ అంటారు. జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల పరిధిలో ఎక్కడ ప్రమాదాలు జరిగినా స్థానిక ఆసుపత్రులకు వారిని చేర్చడానికే ఒక్కోసారి చాలా సమయం పడుతుంది. ఇక్కడ వైద్యం అందని పక్షంలో నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌కు తరలించాల్సిన పరిస్థితిలో రోగులు గమ్యం చేరేలోపే మృత్యువుకు చేరువైన సందర్భాలు అనేకం ఉన్నాయి. జగిత్యాలలోనే ఆధునిక వైద్యం ట్రామాకేర్ సేవలు అందుబాటులోకి తేవాలనే డిమాండ్ చాలా రోజుల నుంచి ఉంది. కేవలం ప్రాథమిక చికిత్స అనంతరం పెద్దాసుపత్రికి సిఫారసు చేయాల్సి వస్తోంది. కోరుట్ల, మెట్‌పల్లికి అనుసంధానంగా అత్యధిక గ్రామాలున్నాయి. తరచూ ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. తీవ్రగాయాల బారినపడిన క్షతగాత్రులు పలు సందర్భాల్లో అత్యవసర వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు.

**పరీక్షల కోసం ప్రైవేటుకు వెళ్లాల్సిందే**

కోరుట్ల సామాజిక ఆసుపత్రి 30 నుంచి 100 పడకల వరకు స్థాయి పెరిగినా సదుపాయాలు సమకూరలేదు. అత్యవసర వైద్యం కోసం వచ్చేవారికి కనీసం ఈసీజీ, ఎక్స్‌రే సౌకర్యాలు కూడా ఆసుపత్రిలో లేకపోవడం గమనార్హం. కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విలువైన యంత్రాలు, పరికరాలు ఉన్నా నిపుణులు, సిబ్బంది లేక నిరుపయోగంగా మారాయి. ఆసుపత్రికి అధునాతన ఎక్స్‌రే యంత్రం అందజేసినా బిగించకపోగా టెక్నీషియన్లు లేక ఇప్పటివరకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఈసీజీ యంత్రం చెడిపోవడంతో మరమ్మతు చేయించకుండా వదిలేశారు. స్కానింగ్, సిటీస్కాన్ కోసం గర్భిణులు, క్షతగాత్రులను జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నారు. ల్యాబ్‌లో పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండటంతో రక్త, మూత్ర, ఇతర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నిరుపేదలు జగిత్యాల ఏరియా ఆసుపత్రికి వెళ్తుండగా, చాలా మంది రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి పరీక్షించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

# తాత్కాలిక గోదాములకు తరలించాలి

**ప్రజానావ, సిరిసిల్ల:**



రైస్ మిల్లుల వద్ద ధాన్యం దించుకొని పక్షంలో వెంటనే తాత్కాలిక (ఇంటర్మీడియట్) గోదాములకు సదరు ధాన్యాన్ని తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ లతో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలు పై సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో కొనుగోలు కేంద్రాల వారిగా ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, లోడింగ్ ఎలా జరుగుతుంది, అవసరమైన వాహనాలు సిద్ధంగా ఉన్నాయా మొదలగు వివరాలను జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు.

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు కోసం మొత్తం 248 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయగా ,ఇప్పటి వరకు 246 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని అన్నారు. నాణ్యత ప్రమాణాలు గల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర పై కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించే విధంగా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జిల్లాలో ఎక్కడైనా రైస్ మిల్లర్లు ధాన్యం దించుకోవడానికి ఇష్టపడని పక్షంలో వెంటనే ప్రభుత్వం గుర్తించిన తాత్కాలిక (ఇంటర్మీడియట్) గోదాములకు సదరు ధాన్యాన్ని తరలించేలా పౌరసరఫరాల శాఖ అధికారి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

సిరిసిల్ల జిల్లా అప్పెరల్ పార్కు లోని గోదాములను తాత్కాలిక (ఇంటర్మీడియట్) గోదాములగా గుర్తించామని, మిల్లర్లు దాన్యం దించుకొని పక్షంలో ఇక్కడికి తరలించాలని, రైస్ మిల్లు వద్ద ఆరు గంటలకు మించి ధాన్యం వెయిట్ చేయడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

దాన్యం కొనుగోలు పై ప్రభుత్వం పట్ల సానుకూలత వచ్చే విధంగా అధికారులు పని చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం, రైతులకు సకాలంలో చెల్లింపులు, సన్న రకం ధాన్యానికి బోనస్ మొదలగు వివరాలను ప్రతి రోజు అందించాలని అన్నారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు సన్న రకం ధాన్యానికి 500 బోనస్ అందించు (పోస్టర్) గోడప్రతిని ఆవిష్కరించారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ,డి.ఆర్.డి.ఓ. శేషాద్రి , డి.సి.ఎస్.ఓ. వసంత లక్ష్మి, డి.ఎం. సివిల్ సప్లై రజిత, డి.సి.ఓ. రామకృష్ణ , డి.ఎం.సి. మెప్మ రాజేశం , డి.సి.ఎం.ఎస్. సెంటర్ ఇన్చార్జి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

- రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు
- కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు వెంటనే జరిగేలా చర్యలు
- వరి ధాన్యం కొనుగోలు వివరాలు ప్రతిరోజు అందించాలి
- వరి ధాన్యం కొనుగోలు (పోస్టర్ ) గోడప్రతి ఆవిష్కరణ
- ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

# ఇష్టారాజ్యంగా మాత్రల దందా

**ప్రజానావ, వరంగల్:**



ప్రైవేటు మందుల దుకాణాల దందా ఆగడంలేదు. నిబంధనలు ఖాతరు చేయక వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే షెడ్యూల్ హెచ్ 1, మందుల విక్రయాలు చేస్తున్నారు. ఫలితంగా సొంతవైద్యంతో ప్రజలు తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలానికి చెందిన గర్భిణి ఓ మెడికల్ స్టోర్‌లో కొనుగోలు చేసిన గర్భవిచ్ఛిత్తి మాత్రలు వేసుకోవడంతో పరిస్థితి విషమించి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో మందుల దుకాణదారులు నిబంధనలు పాటించకుండా, రిజిస్టర్డ్ ఫార్మసిస్టు లేకుండానే ఇష్టారీతిన మందులను విక్రయిస్తున్నారు.. ఈ ఘటనపై ఈనాడులో కథనం ప్రచురితం కావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

**ఇవీ నిబంధనలు..**

డ్రగ్స్ అండ్ కాస్మటిక్ యాక్టు 1940 ప్రకారం మందుల దుకాణాలలో రిజిస్టర్ ఫార్మసిస్టు మాత్రమే మందులు ఇవ్వాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్యుడు సూచించినవి (ప్రిస్కిప్షన్) మాత్రమే విక్రయించాలి. ఇందులో షెడ్యూల్ హెచ్ మందులు విక్రయించే సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్యూల్ హెచ్‌బి ప్రకారం 40 రకాల మందులను వైద్యుడి ప్రిస్కిప్షన్ ఉన్నప్పుడే విక్రయించాలి. ముఖ్యంగా షెడ్యూల్ హెచ్ కింద వచ్చే ఆండ్రోజెనిక్, అనాబాలిక్, ఈస్ట్రోజెనిక్, హెపటైటిస్ బి టీకా, ఇబుప్రొఫెన్, వాసోప్రెసిన్, నార్కోటిక్ డ్రగ్స్ కిందకు వచ్చే సైకోట్రోపిక్ మందులను, షెడ్యూల్ జీ కింద వచ్చే మందులలో యాంటినియోప్లాస్టిక్, యాంటీ కన్వల్సెంట్లు, ఆక్సాజోలిడినిడయోన్స్, యూరైడ్స్, అలాగే హైపోగెసిమిక్ మందులలో ఉదా: సల్ఫోనిలురియాస్, బిగ్యునైడ్స్, యాంటిహిస్టామైన్‌లు, ఇవేగాక షెడ్యూల్ హెచ్ 1 కింద వచ్చే మందులలో యాంటీబయాటిక్స్ తదితరం.. ఉన్నాయి. ఇవన్నీ డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయించొద్దు. ఎవరికి ఆ మందులను విక్రయించారన్నది హెచ్ 1 రిజిస్టర్‌లో నమోదు చేయాలి. దీంతో పాటు ఆయా మందులు కొనుగోలు చేసిన వారికి రసీదు అందించాలి.

**ఇదీ పరిస్థితి..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రైవేటు మందుల దుకాణాలలో నిబంధనలకు విరుద్ధంగా ఔషధ విక్రయాలు చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినా ఔషధ నియంత్రణశాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేయకపోవడం వారికి కలిసివస్తోంది. మత్తు కలిగించే మాత్రలు, సిరప్‌లు, గర్భనిరోధక, విచ్ఛిత్తి, యాంటీబయాటిక్స్, మానసిక రుగ్మతలకు సంబంధించిన మాత్రలు సైతం విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ మాటున జనరిక్ మందులను, ఒకే ఫార్ములా కలిగి ఉన్న తక్కువ ధర మందులను ఎక్కువ ధరలకు అంటగడుతున్నారు. మందులు కొనుగోలు చేసిన వారికి బిల్లులు ఇవ్వడంలేదు. అన్ని మందుల దుకాణాల్లోనూ రిజిస్టర్డ్ ఫార్మసిస్టులు ఉండటం లేదు.

ఇటీవల ములుగు రోడ్డులోని ఓ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద చేరి చికిత్స పొందిన బాధితుడికి ఉచితంగా ఇవ్వాల్సిన బ్రాండెడ్ మందులకు బదులుగా జనరిక్ మందులిచ్చారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు..

**చర్యలు తీసుకుంటాం**

**డా.రాజ్యలక్ష్మి, సహాయ సంచాలకురాలు, ఔషధ నియంత్రణశాఖ, వరంగల్**

గర్భ విచ్ఛిత్తి మాత్రల విక్రయం గురించి 'ఈనాడు'లో వచ్చిన కథనంపై డ్రగ్స్‌కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వివి కమలాసన్ రెడ్డి విచారణకు ఆదేశించారు. తక్షణమే విచారణ చేసి మాత్రలు విక్రయించిన దుకాణదారుపై చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా ఔషధ నియంత్రణశాఖ ఇన్‌స్పెక్టర్ పావనికి సూచించాం.ప్రస్తుతం ఆమె విచారణ చేస్తున్నారు. మాదృష్టికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తనిఖీలు చేస్తున్నాం.

# కొనరేమి.. రైతు గోడు!

**ప్రజానావ, కరీంనగర్/ సిరిసిల్ల/జమ్మికుంట:**

ఆరుగాలం శ్రమించే రైతన్న గోస మారడం లేదు.. కొనుగోలు : వరి ధాన్యం, పత్తి విక్రయానికి తిప్పలు కేంద్రాల వద్ద పడిగాపులు తప్పడం లేదు.. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.. పండించిన పత్తి, వరి ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోలేక మదనపడుతున్నారు.. రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించే పరిస్థితితో తల్లడిల్లుతున్నారు.

**'తేమ' సాకుతో..!**

**: సీసీఐ 12 శాతం కన్నా ఎక్కువ తేమ ఉంటే పత్తిని కొనడం లేదు.**

వరి ధాన్యం విషయంలోనూ తేమ సాకు చూపుతున్నారు. వాస్తవానికి కల్లాల్లో ధాన్యం నిర్ణీత 17 శాతం లోపు ఉంటున్నా తీసుకోవడం లేదు. అకాల వర్షంతో ధాన్యం తడిసినా.. కష్టపడి పంటను ఆరబెట్టుకున్న రైతులు విక్రయాలు ప్రారంభం కాక ఆవేదనతో నిరీక్షిస్తున్నారు.

**అసలు జాప్యమిదీ..**

ఆర్భాటంగానే దాదాపుగా ఇరవై రోజుల కిందట నాలుగు జిల్లాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కొబ్బరికాయలు కొట్టిన తరువాత ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ కేంద్రాల వైపు వెళ్లిన దాఖలాలు లేవు. వాస్తవానికి మిల్లర్లతో ధాన్యం సరఫరాకు సంబంధించిన ఒప్పందాలు కుదరకపోవడం, బ్యాంకు గ్యారెంటీల విషయంలో ఇక్కట్లు కొలిక్కి రాకపోవడం, సరైన స్థాయిలో కొనుగోలుకు



అవసరమైన ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో లేకపోవడం, లారీలు, సంచుల విషయంలో ప్రణాళికకే పరిమితమవడంలాంటి కారణాల వల్లనే ఈసారి విపరీత జాప్యం జరిగింది. ఉమ్మడి జిల్లాలో 11.75 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు 20.59 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినా.. ఇప్పటి వరకు కనీసం లక్ష టన్నుల ధాన్యాన్ని సేకరించలేకపోయారు. ప్రారంభించిన 1360 కేంద్రాల్లో పదో వంతులో కూడా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. పత్తి విక్రయం విషయంలో అన్నదాత పరిస్థితి మరీ అధ్వానం. 1.58 లక్షల ఎకరాల్లో సాగైన ఈ పంట దిగుబడి మార్కెట్‌కు వస్తోంది. కానీ కొనుగోళ్ల వద్దనే అసలు చిక్కు ఎదురవుతోంది. పేరుకే సీసీఐ (భారతీయ పత్తి సంస్థ) ఉమ్మడి జిల్లాలో 26 చోట్ల నోటిఫై చేసుకున్న జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లను ప్రారంభించినా.. అయిదారుచోట్ల మాత్రమే పక్కాగా సేకరిస్తున్నారు. నిబంధనల కొర్రీలు ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు ఇవ్వడం లాంటి ఇక్కట్లున్నాయి. ఏపీఎంసీ (వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీ)లో ఆధార్ ప్రామాణీకరణ, ఆన్‌లైన్ రిజిస్టర్ లాంటివి ప్రతిబంధకంగా మారుతున్నాయి. పైగా పత్తి పింజ పొడవు 29.5 మి.మీ.ల నుంచి 30.5 మి.మీ.లు ఉంటేనే నాణ్యమైనదని తేలుస్తున్నారు. అంతకన్నా తక్కువున్నా.. పత్తిని కొనడానికి సీసీఐ ససేమిరా అంటోంది.

**మద్దతు 'ధర' దక్కట్లే..**

పత్తి, ధాన్యానికి మద్దతు ధర దక్కడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి క్వింటాలుకు రూ.7,521, ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ.2,320, కామన్‌కు రూ.2,300 మద్దతు ధర నిర్ణయించినా ఇవి అందుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. మార్కెట్ మాయాజాలంలో ప్రైవేటు వ్యాపారులదే పై చేయి కనిపిస్తోంది. నేరుగా కల్లాల్లోకి వచ్చి రూ.2 వేలకే ధాన్యాన్ని కొంటున్నారు. రైతులు కూడా కేంద్రాల్లో పడిగాపులు కాసే పరిస్థితి లేక చేతికి వచ్చిన సొమ్మే మేలని అమ్ముకుంటున్నారు. పత్తిని ప్రైవేటు వ్యాపారులకే రూ.7 వేల వరకు విక్రయిస్తూ ఇంటి బాట పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కర్షకుల కష్టాలను క్షేత్రస్థాయిలో గమనించి వారికి మద్దతును అందించాల్సిన అవసరముంది.




# నూజివీడ్ క్యాప్సూల్ మొక్కజొన్న రకంతో అధిక దిగుబడి

**ప్రజానావ, మహబూబ్‌నగర్ :**

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ హేమాజిపూర్ గ్రామంలో రైతు అంజయ్య పొలంలో క్యాప్సూల్ మొక్కజొన్న రకంపై రైతుక్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి రాములు, ఆర్ఎం నర్సింహులు మాట్లాడుతూ క్యాప్సూల్‌తో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ క్యాప్సూల్ అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రీటైలర్స్, వివిధ గ్రామాల రైతులు, పాల్గొన్నారు.




# ఒక్కో పోస్టుకు రూ.1.50 లక్షలు..!



**ప్రజానావ, జగిత్యాల:**

జగిత్యాల పురపాలక సంఘంలో ఒప్పంద పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు 15 వరకు ఇటీవల వివిధ కారణాలతో ఖాళీ అయ్యాయి. 3 పోస్టులను గత జులైలో నిబంధనల మేరకు పురపాలక కౌన్సిల్ ఆమోదంతో నియమించారు. మిగిలిన 12 పోస్టుల్లో కార్మికులను గత 3 నెలల కిందట నిబంధనలకు విరుద్ధంగా నియమించారు. సిబ్బందిని భర్తీ చేయాలంటే కౌన్సిల్ ఆమోదం లేదా కలెక్టర్ అప్రూవల్ ఉండాలి. ఇవేవీ లేకుండా తమకు అనుకూలమైన వారి నుంచి అందినంత దండుకొని కార్మికులుగా నియమించారు. ఈ విషయమై కౌన్సిల్‌లోనూ తీవ్రమైన చర్చ జరిగింది. పాలకవర్గంలో ఈ నియామకాలకు సంబంధించి వివాదాలు తలెత్తాయి. ఈ నియామకాలు నిలిపివేయాలంటూ ఇటీవల పలువురు కౌన్సిలర్లు కమిషనర్ చిరంజీవికి ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఇటీవల నియమితులైన కార్మికుల వేతనాలు నిలిపివేసినట్లు సమాచారం.

**వేతనాల నిలిపివేత:** జగిత్యాల పురపాలికలో ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు 262 మంది ఉన్నారు. వీరిలో కొందరు ఇటీవల అనారోగ్యంతో మానేయడం ఇతర వృత్తుల్లోకి వెళ్లడంతో 15 ఖాళీలు ఏర్పడ్డాయి. నెలకు రూ.15,500 వేతనం కావడంతో వీటికి భారీగా డిమాండ్ ఉంది. ఇదే అదనుగా కొందరు ఒక్కో పోస్టుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి బల్దియాలో నియమించారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ నిబంధనలు వర్తింపజేయాలంటే కమిషనర్ ధ్రువీకరించాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాల ఫైలును గత కమిషనర్ కూడా పక్కనబెట్టినట్లు సమాచారం. తాజాగా ప్రస్తుత కమిషనర్ కూడా 12 మంది నియామకాలకు సంబంధించిన అక్టోబరు నెల వేతనాలు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టుల్లో చేరినవారు ఆందోళనకు గురవుతున్నారు.

**సమాఖ్యకే సమాచారం లేదట..:** ఒప్పంద పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు, వేతనాల చెల్లింపు తదితర అంశాలన్నీ పట్టణ సమాఖ్య ద్వారా నిర్వహిస్తారు. బల్దియాలో 12 మంది ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులను నియమించిన విషయమై పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తమ సమాఖ్య ద్వారా ఎలాంటి నియామకాలు చేపట్టలేదని స్పష్టం చేశారు. కానీ పురపాలిక రికార్డుల్లో మాత్రం పట్టణ సమాఖ్య ద్వారా 12 మంది సిబ్బందిని నియమించినట్లు ఉంది.

**పరిశీలించిన తరువాతే..**

12 మంది ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించిన వేతనాలు నిలిపివేశాం. నియామకాల ఫైలును పరిశీలించిన తరువాత నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటాము. ఇటీవల ఎలాంటి నియామకాలు చేపట్టలేదు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# లెమన్ జ్యూస్... సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయ్ జాగ్రత్త!



నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే.. నిమ్మరసం తాగితే మన శరీరానికి కావాల్సిన సి విటమిన్ దొరుకుతుందని, అంతే కాదు నిమ్మరసంలో ఉండే పోషకాలు మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయని చెబుతారు. అయితే కొంతమందికి నిమ్మరసం తాగడం ఏ మాత్రం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారు పొరపాటున కూడా నిమ్మరసాన్ని తీసుకోకూడదని చెబుతున్నారు.



### ఈ సమస్యలుంటే వద్దు...

నిమ్మకాయలో ఉండే విటమిన్ సి ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ నిమ్మరసాన్ని పరిమితంగానే తీసుకోవాలి. అలాగే కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారు నిమ్మరసానికి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. దంతాల సమస్య ఉన్నవారు నిమ్మరసాన్ని తీసుకుంటే ఎక్కువ నీటిలో కలుపుకొని తీసుకోవాలి. లేదంటే దంతాల సమస్య తీవ్రంగా మారుతుంది.

దంతాల సమస్య, అలెర్జీలు ఉన్నవారు జాగ్రత్త మరీ తక్కువ నీటిలో లేదా నిమ్మరసాన్ని నేరుగా తీసుకున్న దంతాలు బాగా దెబ్బతిని ఇబ్బంది పడతారు. ఇక కొంతమందికి సిట్రస్ పండ్లను తింటే దురద, దద్దుర్లు వంటివి వస్తాయి. అలర్జీ సమస్యతో బాధపడేవారు నిమ్మరసానికి దూరంగా ఉండాలి. కొంతమందికి నిమ్మరసాన్ని తీసుకుంటే పెదవులు, నాలుక పైన, గొంతులోన వాపు వస్తుంది. అలాంటివారు నిమ్మరసానికి దూరంగా ఉండాలి.

### మెడిసిన్ వాడేవారికి కష్టమే...

కొన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మెడిసిన్ వాడేవారు నిమ్మరసం తాగితే వాటి ప్రభావం సరిగా పనిచేయదు. కాబట్టి వారు కూడా నిమ్మరసానికి దూరంగా ఉండాలి. నిమ్మకాయ కాలేయం యొక్క ఎంజైములను ప్రభావితం చేయడం వల్ల మందులు వాడే వారిలో ఆ మందులు పనిచేయకుండా పోతాయని చెబుతారు.

### యాసిడ్, అల్సర్స్ ఉంటే నో..

అంతే కాదు కొంతమంది ఎసిడిటీతో బాధపడుతూ ఉంటారు. కడుపులో యాసిడ్ సమస్యతో బాధపడేవారు పొట్టలో యాసిడ్ రియాక్షన్స్ జరిగినప్పుడు, అల్సర్ సమస్య ఉన్నప్పుడు నిమ్మరసాన్ని నేరుగా తీసుకోకూడదు. తక్కువ నీటిలో కలిపి తీసుకున్న కూడా ఇబ్బంది వస్తుంది. కనుక నిమ్మరసాన్ని తీసుకోవాలనుకునేవారు ఈ అనారోగ్య సమస్యలు కానీ అలర్జీలు కానీ లేకుండా ఉండాలి.

### పరిమితంగా తీసుకుంటే సేఫ్....

అయితే అతిగా నిమ్మరసాన్ని తీసుకోవడం కూడా ఏ మాత్రం మంచిది కాదు. ఏదైనా పరిమితంగా క్రమబద్ధంగా తీసుకున్నప్పుడే దాని నుండి మంచి ఫలితం వస్తుంది. కాబట్టి పైన పేర్కొన్న అనారోగ్య సమస్యలు ఉన్నవారు పొరపాటున కూడా నిమ్మరసాన్ని అతిగా తీసుకోకండి.

## దానిమ్మ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు



పోషకాలు పుష్కలంగా ఉండే దానిమ్మ పండ్లను తినడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్‌సి, ఫోలేట్, పొటాషియం అందుతాయి. దానిమ్మలో చర్మాన్ని అందంగా మార్చే గుణాలు కూడా ఉన్నాయి. అయితే.. సాధారణంగా తినడంతో పోలిస్తే.. ఖాళీ కడుపుతో తింటే బోలెడన్ని ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు పేర్కొంటున్నారు

దానిమ్మ పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. దానిమ్మ పండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దానిమ్మలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.. దానిమ్మపండులోని పాలీఫెనాల్స్ మీ గుండెను, రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు.. వ్యాధుల నుంచి రక్షిస్తాయి. అందుకే.. దానిమ్మపండును పోషకాల పండుగా పేర్కొంటారు. రోజూ ఒక దానిమ్మపండును తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి..

- రోజూ ఒక దానిమ్మ పండును ఖాళీ కడుపుతో తింటే శరీరంలో బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.
- దానిమ్మను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒత్తిడి, వాపు తగ్గుతుంది.
- దానిమ్మ గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహంలో సహాయపడుతుంది.
- దానిమ్మలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి హృద్రోగులకు మేలు చేస్తాయి..
- శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది.
- రోజూ ఒక దానిమ్మపండు తింటే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.
- దానిమ్మ బీపీ సమస్యను కూడా నియంత్రిస్తుంది.




# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్కంధవి

**ప్రజానావ, శామీర్‌పేట:**

68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న కీసరలోని సెరినిటీ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అండర్ 14 బాలికల విభాగంలో శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లోని జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ పాఠశాల విద్యార్థిని, కేశవరం గ్రామానికి చెందిన మేడోజి స్కంధవి రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైంది. ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆథిత్యం ఇవ్వనుంది. రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ఆట ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎదగాలని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేస్తూ స్కంధవికి ఆశీస్సులు, అభినందనలు తెలిపారు.

# సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్న బండి



**ప్రజానావ, వేములవాడ:**

రాజన్న ఆలయ దత్తత దేవాలయం మామిడిపల్లి శ్రీ సీతా రామచంద్ర స్వామి వారిని మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు బండి సంజయ్‌కు స్వస్తి వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికి వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ కే.వినోద్ రెడ్డి శేష వస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజేష్, ఏఈఓ బీ. శ్రీనివాస్ లతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్ లు ఉన్నారు.

# పత్తి సేకరణకు జిల్లాలో 14 కేంద్రాల ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజానావ, వికారాబాద్:**



జిల్లాలో పత్తి రైతులకు కనీస మద్దతు దర కల్పించేందుకు రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు సంబంధిత సేవలను అందించేందుకు జిల్లా యంత్రాగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళ వారం కల్లెక్టర్ కాన్ఫరెన్సు హాలు నందు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ ద్వారా వాట్సాప్ నెంబర్ 8897281111 ప్రారంభించడం జరిగిందని, దీని ద్వారా క్రాప్ బుకింగ్‌లో ఉన్న డేటాను, అమ్మకం విస్తీర్ణం, వత్తి సాగు అర్హత, తక్ పట్టి వివరాలు, కొనుగోలు వివరాలు రైతులు తమ ఇంటి వద్ద నుండే తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలోని తాండూర్‌లో 3, వికారాబాద్‌లో 3, పరిగిలో 3, కోటిపల్లిలో 2, ధారూర్‌లో 1, మర్పల్లిలో 1, కొండంగల్ 1, వికారాబాద్ జిల్లాలో 14 మిల్లులలో సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ పత్తిని కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ నెలఖరు వరకు 286.23మెట్రిక్ టన్నుల పత్తిని 3 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా 183మంది రైతుల అమ్మకం చేసినట్లు తెలిపారు. రైతులుకనీస మద్దతు ధర పొందాలంటే వత్తి తేమ శాతం 5 నుండి 12 మధ్యలో ఉండే విధంగా చూసుకోవాలని, విడిగా. లూజుగా తీసుకు రావాలని, దీని వలన పత్తి నాణ్యత పెరుగుతుందని, దిగుమతి అయ్యే ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అయి తొందరగా అమ్మకాలు పూర్తి అవుతాయని అన్నారు. రైతులు అందరూ ఒకేసారి. కాకుండా దశలవారీగా పూర్తిగా ఆరిన పత్తిని అమ్మడానికి వత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తరం జిరాక్స్, ఆధార్ కార్డుతో లింక్ అయిన మొబైల్ నెంబరును తప్పక వెంట తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి సారంగా పాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఒక్క గింజ కూడా కొనలేదు

## మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**ప్రజానావ, రామాయంపేట:**



మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో కొబ్బరికాయలు కొట్టడం, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం తప్ప రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం ఒక్క గింజ కూడా ధాన్యం కొనుగోలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించకుంటే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రం నుండి జిల్లా అధికారులకు ఫోన్లో మాట్లాడారు రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు గత ప్రభుత్వం 17 తేమశాతంతో ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ ప్రభుత్వం 12% పేరిట రైతులను ఇబ్బంది పెడుతుందని ఆమె మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు లేవని ఆమె మండిపడ్డారు షరతులు లేకుండా అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, బుర్ర అనిల్ కుమార్, సిద్దిరాం రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, శివాయిపల్లి తాజా మాజీ సర్పంచ్ సుధాకర్, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.




# తల్లి పేరుపై ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలి

**ప్రజానావ, వికారాబాద్:**


స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే నినాదంతో ప్రధానమంత్రి పిలుపు మేరకు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు మహావీర్ హాస్పిటల్ రోడ్డులో గల మున్సిపల్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ ముఖ్యతిథిగా హాజరై మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడడంతో పాటు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. అనంతరం అనంతగిరిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో చైర్ పర్సన్ గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో స్థానిక కౌన్సిలర్లు చందర్ నాయక్, మోముల స్వాతి రాజ్ కుమార్, కమిషనర్ జాకిర్ అహ్మద్, నాయకులు హసీబ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యువజన అధికారి ఐజయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టు వరకు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే దానం వెంట 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, సీనియర్ నాయకుడు ఆకుల రాజు, ఎండ్ గని, దయ్యాల దాసు, బోదాస్ నాగార్జున, గుంజ ఆంజనేయులు, ఎండ్ వల్లి, నాగేశ్ సాగర్, ఏ. అశోక్, గద్దల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

- ప్రజానావ, ఖైరతాబాద్

# మహా పడిపూజకు రూ.2 లక్షల విరాళం





దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఇష్టమైన బోనాల నైవేద్యాలు సమర్పించుకొని సేవలో తరించారు. పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఈవో వినోద్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఆయన వెంట అనుబంధ ఆలయం పర్యవేక్షకుడు వెంకట ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్, పీఆర్ఓ ఎడ్ల శివ సాయి ఉన్నారు.

- ప్రజానావ, వేములవాడ

# టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

**ప్రజానావ, శామీర్‌పేట్:**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీఎస్‌యూటీఎఫ్ శామీర్‌పేట మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం ఎన్నికల పరిశీలకులుగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన కార్యవర్గంలో టీఎస్‌యూటీఎఫ్ శామీర్‌పేట్ మండల అధ్యక్షులుగా తిరుమలేష్, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కోశాధికారిగా తిరుమల ప్రసాద్, కార్యదర్శులుగా అంజయ్య, నెహ్రూనాయక్, మనోహర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా నాగపూర్ణిమ, మంజుల ఎంపికయ్యారు. ఎంసీపల్లి మండల్ నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కార్యదర్శులుగా నర్సింహ, సయ్యద్ షాబాద్, శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శిలు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు శ్రీదేవిజానాయక్, సత్యనారాయణ, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# న్యాయవాదికి ఘన సన్మానం



**ప్రజానావ, దౌల్తాబాద్:**

తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది తలకొక్కుల రాజుకు ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపామని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది సామాజికవేత్త తలకొక్కుల రాజు తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. భారత దేశంలో ప్రాచీన రాజుల కాలంలో విలువిద్య ఎంతో ప్రముఖమైనదని అలాంటి విలువిద్య ఆధునిక కాలంలో శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానంతో నగరాలకే ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైందని అలాంటి ఆర్చరీ క్రీడాలను రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి ఆర్చరీ క్రీడల్లో నిష్ణతులను చేయాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు తుమ్మ శ్రీనివాస్, ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పుట్టరాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు

**ప్రజానావ, సిరిసిల్ల:**

రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఒక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణం జయనగర్ కు చెందిన పుదారి రాజు అనే వ్యక్తి 2017 నవంబర్ లో అంబికానగర్ లోని తాళం వేసిన ఓ ఇంట్లోకి చొరబడి రూ. 97 వేల విలువగల వస్తువులు ఎత్తుకెళ్లాడు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు అప్పటి పట్టణ ఎస్ఐ ఎండీ లియకత్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. విచారణ అధికారి శేఖర్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్, ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుముల సందీప్ వాదనల అనంతరం న్యాయమూర్తి ఏ.ప్రవీణ్ పుదరి రాజుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విదిస్తూ తీర్పునిచ్చారు. అలాగే సిరిసిల్ల పట్టణం శివనగర్ కు చెందిన ఐలవేణి సుమన్ అలియాస్ అర్జున్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతుండగా 2023 సెప్టెంబర్ లో పట్టణ పరిధిలోని కార్గిల్ లేక వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిచినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన రాజ్‌నారాయణ



**ప్రజానావ, రామయంపేట:**

మెదక్ జిల్లా రామాయంపేట మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసినటువంటి వరి కొనుగోలు కేంద్రాన్ని ఇన్చార్జి సహాయ సంచాలకులు రాజ్ నారాయణ సందర్శించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రామాయంపేట మండల వ్యాప్తంగా 16,492 ఎకరాల్లో వరి పంట ఈ వాన కాలంలో సాగు జరిగిందన్నారు.మండల వ్యాప్తంగా 43,209 మెట్రిక్ టనుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు.వీటి కొనుగోలు కోసం మండల వ్యాప్తంగా 13 సెంటర్లు ప్రాథమిక సహకార సంఘాల ద్వారా మరియు రెండు కేంద్రాలు ఐకెపి కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా మంగళవారం రోజు 13 కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రారంభం జరిగిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కనీస నాణ్యత ప్రమాణాలు పాటించినట్లయితే ప్రభుత్వ మద్దతు ధర లభించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవీణ్ తో పాటుగా ప్రాథమిక సహకార సంఘం సీఈవో నర్సింలు రైతులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఓటర్ నమోదు చేసుకోవాలి

## ఓటర్ నమోదు ప్రతినిధి పాలాస నరేందర్

**ప్రజానావ, వేములవాడ:**

ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల స్థానాలకు ఓటరు నమోదు కార్యక్రమం ఈ నెల 6తో ముగుస్తుందని, పట్టభద్రులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఓటర్ నమోదు ప్రతినిధి పాలాస నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటివరకు పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు నమోదు ఆశించినంతగా జరగలేదని, ఓటరు నమోదుకు గడువును పెంచాలని ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరడం జరిగిందన్నారు. అయినా దీనిపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదని ఆయన పేర్కొన్నారు. ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## పది వేల స్క్రీన్‌లలో 'కంగువా'.. దక్షిణాదిలో ఎన్నంటే!

సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రానున్న చిత్రం 'కంగువా' (Kanguva). అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీని రిలీజ్ గురించి నిర్మాత ధనుంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీన్ని భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 10వేల స్క్రీన్స్‌లో దీన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.
'ఈ చిత్రం విడుదల కోసం ఆడియన్స్‌తో పాటు మేము కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. దీన్ని 10వేల స్క్రీన్స్‌లో ప్రదర్శించనున్నాం. వీటిలో చాలా స్క్రీన్లు ఇప్పటికే కన్ఫామ్ అయ్యాయి. దక్షిణాదిలో 2500 కంటే ఎక్కువ స్క్రీన్‌లు, ఉత్తరాదిలో 3,500 స్క్రీన్లలో ప్రదర్శించనున్నామని చెప్పడానికి ఎంతో గర్వపడుతున్నాం. నవంబర్ 14న మొత్తం 10 వేల స్క్రీన్‌లలో భారీస్థాయిలో కంగువా ప్రేక్షకుల ముందుకురానుంది' అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.1000 కోట్ల కలెక్షన్స్ చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్మాత ఇటీవల చెప్పారు. పార్ట్ 2, పార్ట్ 3 కథలు కూడా సిద్ధంగా ఉన్నాయని.. పార్ట్ 1 విజయం ఆధారంగా వాటిని తెరకెక్కించేలా ప్లాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు.
యాక్షన్‌తోపాటు ఎమోషన్స్‌కు ఇందులో అధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఇక ఈ చిత్రం త్రీడీలోనూ అలరించనున్న విషయం తెలిసిందే. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దిశా పఠానీ కథానాయిక. బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. జగపతిబాబు, యోగిబాబు, కోవై సరళ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

## సాయిపల్లవి 'క్వీన్ ఆఫ్ బాక్సాఫీస్'.. 'తండేల్' విడుదల తేదీపై క్లారిటీ..


ఇంటర్నెట్‌డెస్క్: నాగచైతన్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయిక. తాజాగా ఈ సినిమా విడుదల తేదీపై క్లారిటీ ఇస్తూ చిత్రబృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఫిబ్రవరి 7న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమానికి నాగచైతన్య, సాయిపల్లవి, దర్శకుడు చందూ మొండేటీలతో పాటు నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీవాసులు పాల్గొన్నారు. సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. వాలెంటైన్స్ వీక్ ప్రారంభానికి ముందు ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సాయి పల్లవి తనకు కుమార్తెతో సమానమని అల్లు అరవింద్ అన్నారు. తాజాగా విడుదలైన 'అమరన్' చూసి ఎమోషనల్ అయినట్లు చెప్పారు. సాయిపల్లవికి ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు.

నాగ చైతన్య మాట్లాడుతూ.. 'నా కెరీర్‌లో ఇప్పటి వరకు రిలీజ్ డేట్‌ను ముందుగా అనుకొని..దాన్ని బట్టి సినిమా పూర్తిచేసేవాడిని. దాని వల్ల తప్పులు జరిగేవి. సినిమా మొత్తం పూర్తయ్యాక రిలీజ్ డేట్ చెబితే బాగుండేదని అనుకునేవాడిని. ఈ చిత్రంతో అది నెరవేరింది. అల్లు అరవింద్ కూడా ఇలానే ఆలోచించారు. చాలా ఆనందించాను. ఇది గొప్ప చిత్రం. శ్రీకాకుళంలో కొందరు మత్స్యకారుల జీవితం. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేసినా అది పండగే అవుతుంది. మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉన్నాం. గీతా ఆర్ట్స్‌లో ఈ స్టోరీ లైన్ గురించి వినగానే నాకు చేయాలని అనిపించింది. నేను చేస్తానని బన్నివాసుని అడిగాను. పాత్ర గురించి తెలుసుకోవాలని శ్రీకాకుళం వెళ్లి మత్స్యకారులతో గడిపాం. నన్ను తెరపై బాగా చూపించాలని చందూ కష్టపడ్డారు. ఆయన నాకు మంచి స్నేహితుడితో సమానం. సాయి పల్లవితో డ్యాన్స్ చేయడం చాలా కష్టం. ఆమె క్వీన్ ఆఫ్ బాక్సాఫీస్' అని ప్రశంసించారు.

'తెలుగు ప్రేక్షకులు అందరికీ థ్యాంక్స్. 'అమరన్'ను ఊహించని విధంగా ఆదరించారు. నన్ను అల్లు అరవింద్ గారు ఎప్పుడూ కుమార్తెగా భావిస్తారు. 'తండేల్' రియల్ లైఫ్ స్టోరీ. ఈ సినిమా విడుదల విషయంలో నిర్మాతలు ఎప్పుడూ ఒత్తిడి చేయలేదు. టీమ్ అంతా ఎంతో కష్టపడింది. నాగ చైతన్య సంవత్సరం నుంచి ఈ ప్రాజెక్ట్‌లోనే బిజీగా ఉన్నారు. మరో ప్రాజెక్ట్ గురించి కూడా ఆలోచించలేదు. ఇలాంటి నటుడిని నేను ఇప్పటి వరకు చూడలేదు ' అని సాయిపల్లవి అన్నారు.

'నాగచైతన్య అభిమానులు ఈ సినిమా విడుదల తేదీ గురించి చెప్పాలని ఎన్నో మెసేజ్‌లు పెడుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి మెసేజ్‌ను చూస్తున్నాం. అల్లు అరవింద్ అన్ని ప్రణాళికలు వేసే ఫిబ్రవరి 7ను ఎంపిక చేశారు. ఈ చిత్రానికి ఈ తేదీ కచ్చితంగా సరిపోతుంది' అని చందూ మొండేటి అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ..'సినిమా రిలీజ్ డేట్‌కు ఏమేం అంశాలు చూడాలని చందూ నన్ను అడిగాడు. సినిమా విడుదల చేయాలంటే పోటీ ఉండకూడదు ,సినిమా గురించి ప్రజల్లో ఆసక్తి కలిగించాలి. అన్నిటికంటే ముఖ్యం సినిమా బాగుండాలి. ఈ చిత్రంలో మంచి కంటెంట్ ఉంది. ఫిబ్రవరి 14 ప్రాముఖ్యత అందరికీ తెలుసుకదా.. అందుకే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న విడుదల చేద్దామని వివరించా' అని అన్నారు.

'మేము ఈ సినిమా ప్రారంభించినప్పుడు డిసెంబర్‌లో విడుదల చేయాలని భావించాం. ఈ సినిమా షూటింగ్‌కు చాలా పర్మిషన్లు అవసరమయ్యాయి. అలాగే సినిమా క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదు. ఈ సినిమాను చాలా గొప్పగా తెరకెక్కించారు. అక్కినేని అభిమానులు ఈ చిత్రం చూసి కాలర్ ఎగరేస్తారు. ఈ విషయంలో నాది హామీ. ఈ చిత్రం రూ.100కోట్ల క్లబ్‌లో చేరుతుంది' అని బన్నివాసు తెలిపారు.



## కెమెరా ముందు నిల్చున్న ప్రతి సందర్భం ఇష్టమే

"గంభీరమైన పాత్రలే ఎక్కువగా చేస్తూ కెరీర్‌ని సాగిస్తున్న దశలో... వాటికి భిన్నంగా ఓ సరదా అమ్మాయి పాత్ర చేసే అవకాశం 'ధూం ధాం' సినిమాతో దక్కింది. నాకు కొంచెం రిఫ్రెషింగ్‌గా ఉంటుందని వెంటనే అంగీకారం తెలిపా. అలవాటైన పాత్ర కావడంతో మరింత ఉత్సాహంగా నటించా. ప్రేక్షకులకు ఓ మంచి అనుభూతిని పంచే కుటుంబ వినోదం ఉన్న చిత్రమిది'' అన్నారు హెబ్బా పటేల్. కెరీర్ ఆరంభంలో వరుస విజయాల్ని సొంతం చేసుకున్న కథానాయిక ఈమె. ఈమధ్య విజయాల్లేకపోయినా, అవకాశాలపరంగా మాత్రం సత్తా చాటుతూనే ఉంది. ప్రత్యేక గీతాలతోనూ, పరిమిత వ్యయంతో రూపొందుతున్న చిత్రాలతోనూ సందడి చేస్తూనే ఉంది. ఇటీవల చేతన్ కృష్ణ సరసన 'ధూం ధాం'లో నటించింది. సాయికిశోర్ మచ్చా దర్శకత్వంలో ఎం.ఎస్.రామ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హెబ్బాపటేల్ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.
నేను 'ధూం ధాం'లాంటి సినిమా చేసి చాలా కాలం అవుతోంది. దర్శకుడు సాయి రాజేశ్ ఫోన్ చేసి రచయిత గోపీమోహన్ దగ్గర కథ ఉంది. మీకు నచ్చితే నటించండి అని చెప్పారు. ఆయన సలహాతో కథ విన్నా, నచ్చడంతో చేస్తానని చెప్పా. సుహానా అనే యువతిగా నేను నటించా. బాగా డబ్బున్న ఆ అమ్మాయికి ఇంట్లో కావల్సినంత స్వేచ్ఛ ఉండటంతో... విహారం కోసం తను కోరుకున్న ప్రాంతానికల్లా వెళుతుంది. అలా వెళ్లినప్పుడు హీరోని కలవడం, అతనితో స్నేహం, ప్రేమ మొదలవుతాయి. ఆ తర్వాత ఏం జరిగిందనేది ఈ కథలో కీలకం. నటన పరంగా నాకు ఎలాంటి సవాళ్లూ ఎదురు కాలేదు''.
"ప్రేమ, వినోదం, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా రూపొందిన సరదా చిత్రమిది. కెమెరా ముందు హుషారుగా కనిపిస్తూ చేయాల్సిన పాత్రలు కావడంతో నేను, చేతన్ ఎంతో హుషారుగా నటించాం. తను మంచి సహ నటుడు. నాకు సరదాగా మాట్లాడుతూ ఉండే వ్యక్తులంటే ఇష్టం. దర్శకుడు సాయికిశోర్ అలాంటి వ్యక్తే. ఆయనతోపాటు, ఇదివరకు నేను పనిచేసిన కొంతమంది సాంకేతిక నిపుణులు కూడా ఇందులో భాగమయ్యారు. వాళ్లంతా ఉండటంతో ఈ సినిమా ప్రయాణం మరింత ఆహ్లాదకరంగా సాగింది. గోపీసుందర్ స్వరపరిచిన 'మల్లెపూల టాక్సీ..', 'టమాటో బుగ్గలపిల్ల...' తదితర పాటలు ఎంతో ఆదరణ పొందాయి. విజువల్‌గా కూడా అదే స్థాయిలో అలరిస్తాయి ఈ గీతాలు. పోలండ్‌లో అందమైన ప్రదేశాల్లో చిత్రీకరణ చేశాం. నిర్మాత రామ్‌కుమార్ ఎంతో తపన ఉన్న వ్యక్తి. ఆయనకి ఈ సినిమాతో మంచి పేరొస్తుంది''. "నటిగా కెమెరా ముందు నిల్చున్న ప్రతి సందర్భం నాకు ఇష్టమే. సినిమా, వెబ్ సిరీస్, ఆఖరికి ఫొటోషూట్ అయినా సరే ఆస్వాదిస్తా. కొత్త సినిమాకి సంతకం చేసిన రోజు, విడుదల తర్వాత నా సినిమాకి మంచి టాక్ వచ్చిన రోజు నా సంబరాలు 'ధూం ధాం' తరహాలోనే ఉంటాయి. సినిమా అంటే అంత ప్రేమ. ప్రస్తుతం తెలుగుతోపాటు, తమిళంలోనూ సినిమాలు చేస్తున్నా''.



## తొలి భాగానికి దీటుగా 'విడుదల 2'

విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రధారులుగా వెట్రిమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'విడుదల 1' ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ చిత్రానికి కొనసాగింపుగా 'విడుదల 2' రూపొందుతోంది. డిసెంబరు 20న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా తెలుగు ప్రదర్శన హక్కుల్ని నిర్మాత చింతపల్లి రామారావు సొంతం చేసుకున్నారు. శ్రీ వేదాక్షర మూవీస్ పతాకంపై ఈ సినిమాని విడుదల చేస్తున్నట్టు ఆయన చెప్పారు. "గతేడాది విడుదలై ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచింది 'విడుదల 1'. వెట్రిమారన్ గొప్పగా ఆ చిత్రాన్ని తీర్చిదిద్దారు. అందుకు దీటుగా రెండో భాగాన్ని తెరకెక్కించారు. తెలుగు నుంచి చాలా మంది నిర్మాతలు పోటీపడినా ఆ హక్కులు మాకు దక్కాయి. తప్పకుండా సంచలన విజయం సాధించే చిత్రం అవుతుంది'' అన్నారు చింతపల్లి రామారావు. మంజు వారియర్, గౌతమ్ మేనన్, భవాని శ్రీ తదితరులు ఈ చిత్రంలో నటించారు.



Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657